www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 13 మార్చి 2024

5

ఏలూరు



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా వ్యాప్తంగా మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్ రావు తెలిపారు. జిల్లాలో 51 కేంద్రాల్లో జరిగిన ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు మొత్తం 16,849 మందికి గాను 15,944 మంది హాజరు కాగా 905 మంది గైర్హాజరు అయ్యారు. ఇందులో సాధారణ విద్యార్థులు 14,586 మందికి 13,982 మంది హాజరు కాగా 604 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యావిభాగంలో 2,263 మందికి 1,962 మంది హాజరు కాగా 301 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 95 శాతం హాజరు నమోదైందని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రభాకర్ రావు తెలిపారు.

ఏ స్థానం ఎవరికి..!

టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థులపై వీడని ఉత్కంఠ

ఏడు అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులపై సస్పెన్స్

స్థానాల కేటాయింపుపైనా స్పష్టత కరువు

భీమవరం నాదే అన్న పవన్ వ్యాఖ్యలతో డైలమాలో బిజెపి

రఘు రామకృష్ణంరాజు ఏ పార్టీ నుంచి పోటీలో ఉండేనో?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన, బిజెపి పొత్తు ఖరారైనప్పటికీ అభ్యర్థుల ఎంపికపై గానీ, స్థానాల కేటాయింపుపై గానీ, ఇంకా పూర్తిస్థాయిలో స్పష్టతలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా పార్టీల, నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి పొత్తుతో ఎన్నికల బరిలో దిగుతున్నాయి. తొలి జాబితా కింద ఏడు అసెంబ్లీ స్థానాలకు టిడిపి అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన ఏడు స్థానాల్లో టిడిపి ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందో, జనసేనకు ఎన్ని కేటాయించారో, కొత్తగా పొత్తు కుదిరిన బిజెపికి ఏ స్థానాలు ఇస్తారో ఇప్పటికీ స్పష్టత లేకుండా పోయింది. అంతేకాకుండా నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాల అభ్యర్థులపైనా తేల్చని పరిస్థితి నెలకొంది. కైకలూరు స్థానం నుంచి బిజెపి అభ్యర్థి పోటీచేసే అవకాశం ఉన్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. 2014 ఎన్నికల్లో బిజెపి తరపున పోటీచేసి గెలిచి మంత్రిగా కొనసాగిన కామినేని శ్రీనివాస్‌కు మరోసారి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తాడేపల్లిగూడెం గానీ, భీమవరం స్థానం ఏదో ఒకటి తమ పార్టీకి కేటాయించాలని బిజెపి పట్టుబడుతున్నట్లు సమాచారం. అదే జరిగితే అసంతృప్తి జ్వాలలు మరింత పెరిగే అవకాశం ఉంది. దెందులూరు టిక్కెట్ టిడిపికి కేటాయిస్తారా లేక మార్పు ఉంటుందో తేలలేదు. దీంతో దెందులూరులో టిడిపి అభ్యర్థిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చింతమనేని ప్రభాకర్‌కు టిక్కెట్ కేటాయింపు ఉంటుందా అన్న ఉత్కంఠ ఆయన అనుచరుల్లో టెన్షన్ రేపుతోంది. నరసాపురం, ఉంగుటూరు, భీమవరం, పోలవరం, తాడేపల్లిగూడెం స్థానాల్లో జనసేన పోటీ చేయనున్నట్లు చెబుతున్నప్పటికీ ఆపార్టీ నుంచి అధికారికంగా అభ్యర్థుల ప్రకటన మాత్రం వెలువడలేదు. దీంతో ఏస్థానంలో ఎవరు పోటీచేస్తారన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

భీమవరం నాదే అంటూ బిజెపికి కళ్లెమా?

భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మంగళవారం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ భీమవరం వదులుకోను.. నాదే అంటూ మాట్లాడిన పరిస్థితి నెలకొంది. భీమవరం నుంచి తాను పోటీచేస్తారా లేదా అన్న విషయం చెప్పకుండా నాదే అన్నట్లు మాత్రమే మాట్లాడారు. పొత్తులో భాగంగా భీమవరం టిక్కెట్ తమ పార్టీకి కేటాయించాలని బిజెపి అడుగుతున్నట్లు తెలిసింది. భీమవరం స్థానం బిజెపికి ఇచ్చేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ సిద్ధంగాలేరని సమా చారం. అందులో భాగంగానే భీమవరం వదులుకోనంటూ బిజెపికి సంకేతాలు పంపేందుకే పవన్ అలా మాట్లాడి ఉంటారన్న చర్చ నడుస్తోంది. జనసేనలో చేరిన పులపర్తి రామాంజనేయులు ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీచేయనని చెప్పడంతో, భీమవరం నాదే అంటూ పవన్ చెప్పడంతో ఆయన ఇక్కడ నుంచే పోటీ చేస్తారన్న అభిప్రాయం నెలకొంది. భీమవరం నుంచి పవన్ పోటీ ఖాయమన్న సంకేతాలు వెలువడడంతో జనసేన కార్యకర్తల్లో జోష్ నెలకొంది.

రఘు రామకృష్ణంరాజు ఏపార్టీ నుంచి పోటీచేస్తారో?

నరసాపురం ఎంపీగా ఉన్న కనుమూరి రఘు రామకృష్ణం రాజు వచ్చే ఎన్నికల్లో ఏపార్టీ నుంచి పోటీచేస్తారో ఎవరికి అర్థం కావడం లేదు. ఇటీవల తాడేపల్లిగూడెం టిడిపి, జనసేన ఉమ్మడి సభలో పాల్గొన్న రఘురామకృష్ణంరాజు మరోసారి నరసాపురం ఎంపీగా పోటీ చేస్తానంటూ ప్రకటించుకున్నారు. వైసిపి నుంచి బయటికొచ్చిన ఆయన ఇప్పటికీ వరకూ ఏపార్టీలోనూ చేరలేదు. నిన్నటి వరకూ టిడిపి తరపున నరసాపురం ఎంపీగా రఘురామకృష్ణంరాజు పోటీచేస్తారంటూ ప్రచారం సాగింది. పొత్తులో భాగంగా నరసాపురం టిక్కెట్ బిజెపికి ఇవ్వనున్నట్లు కొంత స్పష్టత వచ్చింది. రఘు రామకృష్ణంరాజును బిజెపిలోకి చేర్చుకుని ఆపార్టీ నరసాపురం టిక్కెట్ ఇచ్చేందుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. దీంతో ఆయన ఏపార్టీ నుంచి పోటీ చేస్తారన్న చర్చ నడుస్తోంది. ఏలూరు ఎంపీ స్థానం నుంచి టిడిపి పోటీ చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికీ అభ్యర్థి ఎంపిక పూర్తికాలేదు. టిడిపి తరపున భాష్యం రామకృష్ణ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అంతేకాకుండా టిడిపి సభలకు సంబంధించి ట్రాన్స్‌పోర్ట్ వ్యవహారాలు పరిశీలించే డాక్టర్ పవన్ పేరు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్న పరిస్థితి నెలకొంది.రెండురోజుల్లో అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.



ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరించిన రైల్వే గూడ్స్ షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ (వార్త మెయిన్‌లో..)

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయాలి

జెడ్‌పి సిఇఒ, ఎంసిసి జిల్లా నోడల్ అధికారి కెఎస్ఎస్.సుబ్బారావు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జెడ్‌పి సిఇఒ, ఎంసిసి జిల్లా నోడల్ అధికారి కెఎస్-ఎస్.సుబ్బారావు చెప్పారు. జిల్లాలోని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, మండల, మున్సిపాల్టీ స్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ప్రణాళికాబద్ధంగా చేయాల్సిన కార్యకలాపాల జాబితాను తయారు చేసుకోవాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులకు సర్క్యులర్‌ను జారీచేశారు. క్షేత్రస్థాయిలో వీటి అమలుకు అవసరమైన సిబ్బందిని నియమించుకుని వారికి ప్రవర్తనా నియమావళిపై శిక్షణ పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అభ్యంత రకరమైన పోస్టర్లు, ప్రకటనల నిషేధ చట్టం, 1947 సంబంధిత నిబంధనలను ప్రధానంగా ప్రభుత్వ ఆస్తుల, బహిరంగ స్థలాల ఇప్పటికే ఏర్పాటు చేయబడిన ఫ్లెక్సీలను గుర్తించి వాటి తొలగింపునకు ముందు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను తాత్కాలికంగా తొలగించాలన్నారు. అన్ని సచివాలయాల వద్ద వివిధ ప్రభుత్వ పథకాల వివరాలు తెలియజేస్తూ ఏర్పాటుచేసిన వాల్ పోస్టర్లపై ప్రధాని,ముఖ్య మంత్రి, మంత్రుల ఫోటోలను ముసుగు వేయుటకు తగు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ విషయాలన్నీ సచివాలయ సిబ్బందికి సంబంధిత ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు తప్పక తెలియజేయాలన్నారు. ఎన్నికల కమిషన్ వారు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే కమిషన్ సూచించిన ప్రకారము 72 గంటలలో ఈ కింద తెలిపిన చర్యలు క్షేత్ర స్థాయిలో చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన 24 గంటల్లో కటౌట్, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు మొదలైన వాటిని తొలగించాలన్నారు.ప్రభుత్వ, బహిరంగ స్థలాన్ని దుర్వినియోగం చేయడం, అన్ని అనధికార రాజకీయ ప్రకటనలు, వాల్ రైటింగ్ (పోస్టర్లు పేపర్ల రూపంలో ఏదైనా ఇతర రూపంలో, కట్ట్ హోల్డింగులు, , బ్యానర్ల జెండాలు మొదలైనవి పబ్లిక్ ఆస్తుల వద్ద రైల్వే స్టేషన్ వంటి బహిరంగ ప్రదేశంలో, బస్ స్టాండ్లు, విమానాశ్రయాలు, రైల్వే వంతెనలు, ప్రభుత్వం బస్సులు, విద్యుత్ టెలిఫోన్ స్తంభాలు మున్సిపల్, స్థానిక సంస్థల భవనాలు మొదలైన వాటిని కమిషన్ ఎన్నికల ప్రకటన నుండి 48 గంటల్లోగా తొలగించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి మండల, మున్సిపల్ స్థాయిలో అందరూ ముఖ్యమైన రాజకీయ నాయకులు, అభ్యర్థులకు తెలియజేయాలన్నారు.

'తానేటి' తాయిలాలు..!

ఎన్నికల ప్రలోభాలకు దిగిన హోంమంత్రి తానేటి వనిత

అక్రమాలను అరికట్టాల్సిన శాఖా మంత్రి తీరుపై చర్చ

అంగన్‌వాడీలు,ఆశాలు, వాలంటీర్లు, ఇతర ఉద్యోగులకు ద్వారకాతిరుమలలో గిఫ్ట్‌ల పంపిణీ

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అధికారపార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం ముసుగు

అధికారులే దగ్గరుండి తీసుకెళ్తున్న దుస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికలు సజావుగా జరపాల్సిన బాధ్యత పోలీస్‌శాఖపై ప్రధానంగా ఉంటుంది. ఆ శాఖను సన్మార్గంలో నడిపించాల్సిన హోంమంత్రి తానేటి వనిత ఓటర్లను ప్రలోభపెట్టేందుకు గిఫ్ట్‌లు పంపిణీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆత్మీయ సమావేశం ముసుగులో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు పెద్ద ఎత్తున చిరుద్యోగులకు గిఫ్ట్‌లు పంపిణీ చేస్తున్న పరిస్థితి జిల్లాలో యథేచ్ఛగా కొనసాగుతోంది. దీనికి అధికార యంత్రాంగం సైతం సహకరిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వాలంటీర్లు వంటి ఇతర చిరుద్యోగులతో మంత్రి తానేటి వనిత సోమవారం ద్వారకాతిరుమలలోని ఓ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు రావాలంటూ అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఇతర చిరుద్యోగులందరినీ పిలిచి రాత్రి తొమ్మిది గంటల వరకూ అక్కడే ఉండేలా చేశారు. ఈ సందర్భంగా ఇటీవల అంగన్‌వాడీ వర్కర్లు చేసిన సమ్మెపై విమర్శలు చేయడమే కాకుండా, వైసిపికి ఓట్లు వేయాలంటూ అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు, ఇతర చిరుద్యోగులకు గిఫ్ట్‌లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ ఫ్లాస్క్‌లు, డిన్నర్ సెట్లు గిఫ్ట్‌లుగా అందజేశారు. దాదాపు వెయ్యి మందికిపైగా ఈ సమావేశానికి హాజరైనట్లు చెబుతున్నారు. ఐసిడిఎస్, ఇతర శాఖలకు చెందిన అధికారులే దగ్గరుండి ఆ శాఖల్లో పనిచేసే ఉద్యోగులను వైసిపి నాయకులు నిర్వహించే ఆత్మీయ సమావేశాలకు తీసుకెళ్తున్న పరిస్థితి నెలకొంది. గిఫ్ట్‌లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులకు తెలిసినప్పటికీ వారే దగ్గరుండి పంపిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు రాజకీయ నాయకుల మాదిరిగా ఆత్మీయ సమావేశాల్లో మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. ఎన్నికల ప్రలోభాలను అడ్డుకోవాల్సిన హోంశాఖా మంత్రే బహిరంగంగా ఎన్నికల తాయిలాలు పంపిణీ చేయడం చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మహిళా ఓటర్లే లక్ష్యంగా అధికార పార్టీ నాయకులు తాయిలాలు పంపిణీ చేస్తున్న పరిస్థితి. కొద్దిరోజుల క్రితం ఏలూరు వైసిపి నాయకులు వాలంటీర్లకు, మెప్మా ఆర్‌పిలకు సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఆచంట, పాలకొల్లు వంటి పలు నియోజకవర్గాల్లోనూ డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేసిన పరిస్థితి. ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న తాయిలాల పంపిణీని అడ్డుకోవాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు.



హోంమంత్రి తాయిలాల పంపిణీపై సిఐటియు ఖండన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ద్వారకాతిరుమలలో హోంమంత్రి తానేటి వనిత చిరుద్యోగులకు సోమవారం మీటింగ్ ఏర్పాటు చేసి తాయిలాలు పంపిణీ చేయడాన్ని సిఐటియు ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. అంగన్‌వాడీ, ఆశా, వాలంటీర్లు తదితర ప్రభుత్వ సేవలందించే చిరుద్యోగులకు ద్వారకాతిరుమలలో హోంమంత్రి తానేటి వనిత గిఫ్ట్‌లు పంపిణీ చేసి ఓట్లు వేయాలని ప్రలోభ పెట్టడం పట్ల సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు దగ్గరుండి ఆయా విభాగాల ఉద్యోగులను హోంమంత్రి సమావేశానికి హాజరుపర్చడం దుర్మార్గమన్నారు. 175 కు 175 గెలుస్తామని గొప్పలు చెప్పే వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందే ప్రలోభాలకు తెరతీయడం సిగ్గుచేటన్నారు. హోంమంత్రి స్థానంలో ఉండి ఈ రకంగా చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో పోటీ చేస్తున్న తానేటి వనిత మీటింగ్ పేరుతో మధ్యాహ్నం 3 గంటకు రమ్మని రాత్రి 9 గంటల వరకూ వేచి చూసేలాచేసి, ప్రలోభాలకు గురిచేసి ఓట్లు అడగడం హోంమంత్రి పదవికి అవమానమన్నారు. తక్షణం అధికార పార్టీ ఇలాంటి అధికార దుర్వినియోగ చర్యలకు పాల్పడడం ఆపాలని, లేకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం : ఐద్వా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న హైమావతి

మహిళల హక్కుల కోసం 35 సంవత్సరాల నుంచి ఐద్వా నిరంతరం పని చేస్తోందని ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరు గన్ బజార్‌లో ఐద్వా జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినా దేశంలో చిన్నారులు, మహిళలకు భద్రత లేకుండా పోతుందంటే ఇప్పటి వరకూ దేశాన్ని పాలించిన పాలకులు సిగ్గు పడాలన్నారు. ప్రభుత్వాలు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే మహిళా సాధికారత, అభివృద్ధి అని ఉపన్యాసాలు ఇస్తుంటారని, తరువాత పట్టించుకోరని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మరల పాత కాలపు మనుధర్మ శాస్త్రాన్ని ఆచరణలోకి తీసుకొని రావాలని చూస్తుంది ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీలు ధరించే దుస్తులు, అయ్యప్ప దేవాలయాల్లో మహిళల ప్రవేశం, వంటి అనేక షరతులు పెడుతుందని, సనాతన ధర్మం పేరుతో మూఢత్వ భావాలు తీసుకొని రావాలని చూస్తుందన్నారు. కాబట్టి మహిళలంతా బిజెపి మతోన్మాద విధానాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు టి.సుకన్య, స్వర్ణలత, వెంకటరమణ, స్థానిక మహిళలు కొండమ్మ, సుజాత, పైడమ్మ, భవాని, మేరీ, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పూర్తిస్థాయి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. ఆయన భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాలను మంగళవారం సాయంత్రం సందర్శించారు. దీనిలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కొన్నింటికి ప్రారంభోత్సవాలు చేశారు. భీమడోలు సంతపేటలో నాబార్డ్ నిధులతో నిర్మించనున్న సంత మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి పి.సునీత మాన్సింగ్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ సంత మార్కెట్ కాంప్లెక్స్ అధునీకరణకు ప్రస్తుతం కేటాయించిన నాబార్డ్ నిధులకు అదనంగా గ్రామపంచాయతీ నిధులను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ దృష్టికి తెచ్చారు. ఇదే క్రమంలో గ్రామపంచాయతీ శివారు లింగంపాడు ఆవాస ప్రాంతంలో నిర్మించనున్న 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఒహెచ్ఎస్ఆర్, దానికి అనుబంధంగా నిర్మించనున్న సంప్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత భీమడోలు సంతపేటలో జల జీవన మిషన్ నిధులు రూ.90 లక్షలతో నిర్మించిన లక్ష యాభై వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి సరఫరా పథకానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి జల జీవన మిషన్ నిధులతో మంచినీటి పథకం ట్యాంకు నిర్మాణంతోపాటు, 200 కుళాయిల కనెక్షన్లు ఇచ్చేందుకు అవసరమైన పైపులైను నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. ఇదే క్రమంలో ఎంఎల్ఎ బిసి కాలనీలో ఐదు లక్షల రూపాయల పంచాయతీ ఎన్నికల ఏర్పాటుచేసిన బోరుకు ప్రారంభోత్సవం చేశారు. దీనివల్ల ఆ ప్రాంతంలో నీటి ఎద్దడి సమస్య తొలగిపోతుందని అన్నారు. చివరిగా ఎంఎల్ఎ భీమడోలు ప్రాంతీయ పశువైద్యశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని, ఎంపిపి కనమాల రామయ్య, వైసిపి ప్రముఖులు రావిపాటి సత్య శ్రీనివాస్, పసుపులేటి సత్యనారాయణ, ప్రముఖులు పాల్గొన్నారు.



తాగునీటి బోర్డుకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎంఎల్ఎ

మహిళల ఆర్థికాభివృద్ధికి జగన్ కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మండవల్లి

మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి, మహిళల ఆర్థిక స్వాలంబన కోసం కృషి చేస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో జరిగిన నాలుగో విడత విడుదల చేసిన రూ.9 కోట్ల 71, 66 వైఎస్ఆర్ చేయూత చెక్కును మంగళవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వైఎస్ఆర్ చేయూత కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రతి ఏటా మహిళల అకౌంట్లోనే నేరుగా డబ్బులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు నాలుగు విడతల్లో పంపిణీ చేసిన చేయూత ద్వారా ప్రతి మహిళకు రూ.75 వేల లబ్ధి చేకూరిందని ఆయన అన్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, ప్రజల గుండెల్లో గొప్ప స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా జగన్ పాలన సాగిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలకు పథకాల ద్వారా డబ్బులు అందిస్తూ వారి ఆర్థిక భరోసాకు చేయూతనందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, జెడ్‌పిటిసి ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ వీర్రాజు, సర్పంచి మెండ ఝాన్సీ పాల్గొన్నారు.



ముసునూరు: చెక్కును అందజేస్తున్న ఎంఎల్ఎ

కామవరపుకోట: మండలంలో వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. మండలంలో 3,572 మంది లబ్ధిదారులకు ఆరు కోట్ల డబ్బై లక్షల రూపాయలు లబ్ధి చేకూరిందని జెడ్‌పిటిసి కడిమి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేడవరపు విజయ లక్ష్మి, సర్పంచులు పొన్నాల అనిత, కర్రిపోతు అనూష పాల్గొన్నారు.

ముసునూరు: ఆడపడుచులందరూ కలిసి జగన్మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. మంగళవారం మండలంలోని ముసునూరు వెలుగు కార్యాలయంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గాభవానీల ఆధ్వర్యంలో చేయూత చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జగనన్న ఇండ్ల స్థలాల శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. నూజివీడు మార్కెట్ యార్డు ఛైర్మన్ కంభాల కృష్ణవేణి రాంబాబు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి పాముల గంగాధరరావు, కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, సర్పంచి పేరం కృష్ణ, నక్కనబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల: వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ద్వారకాతిరుమల ఉగాది మండపం వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి హోం మంత్రి తానేటి వనిత ఆ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని 4,202 మందికి నాలుగో విడత చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో ఉంటే చాలు

చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా

జంగారెడ్డిగూడెం టౌన్ : ఎన్ని ఫ్లెక్సీలు తొలగించినా పర్వాలేదు, ప్రజల గుండెల్లో నేను ఉంటే చాలు అని మీడియాతో చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. జంగారెడ్డిగూడెంలో చేయూత నాలుగవ విడత కార్యక్రమంలో ఫ్లెక్సీ తొలగింపుపై మీడియాతో ఆయన స్పందించారు. ఇటువంటి దౌర్భాగ్యం ఏ ఎంఎల్ఎకు రాకూడదని కోరుకుంటున్నానన్నారు. చింతలపూడిలో అవమానపరిచారు, ఇప్పుడు జంగారెడ్డిగూడెంలో కూడా అవమానపరిచారన్నారు. నాకు జరుగుతున్న అవమానాన్ని, ప్రతి విషయాన్ని రాష్ట్ర పెద్దల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకు వెళ్తున్నానని, ఇదంతా వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎంఎల్ఎ ఎలిజా తెలియజేశారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యంగా ఉండాలని సిడిపిఒ లావణ్య తెలిపారు. మండలంలోని భైరవపట్నం అంగన్వాడీ వన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీల ద్వారా పోషక విలువలు ఉన్న పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని అన్నారు. గర్భినులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్‌పై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు ప్రభావతి, మరియమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ లావణ్య


ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

త్వరలో జరగబోవు సాధారణ ఎన్నికలను ఎటువంటి ఆటంకం కలగకుండా సజావుగా జరిగేలా చూడాలని పోలవరం డిఎస్‌పి ఎన్.సురేష్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం జీలుగుమిల్లి సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పెండింగ్ కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి ఆదేశించారు. అదే విధంగా త్వరలో జరగబోవు సాధారణ ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు టి.క్రాంతి కుమార్, శ్రీనివాస్, పలు స్టేషన్ల ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మానవత అవగాహనా తరగతులు

కలిదిండి: మండలంలోని తాడినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహించారు. నైతిక విలువలు, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.విజయకుమార్ వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మానవత సేవా సంస్థ కలిదిండి అధ్యక్షులు గోదావరి సత్యన్నారాయణ, డైరెక్టర్స్ పేటేటి వివేకానంద, మారుబోయిన రత్నారావు, ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలు అందజేస్తూ..



ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి - భీమడోలు

మండల వనరుల కేంద్రంకు వచ్చే ప్రజలు, ఉపాధ్యాయులు సౌకర్యార్థం అదనపు సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని భీమడోలు మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర కుమార్ తెలిపారు. సూరప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని జెఎంఎం పురం(పాతూరు) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మండే సుధాకర్ తన తల్లి దేవదానమ్మ జ్ఞాపకార్థం మండల వనరుల కేంద్రానికి మంగళవారం రెండు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మండల వనరుల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే వారు సేద తీరేందుకు తాను బహూకరించిన సీలింగ్ ఫ్యాన్‌లు సహకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు యూనియన్ నాయకులు ఎం.శరీన్, కెఎంజి.పుల్లారావు, కార్యాలయ సిబ్బంది సుమలత, డేవిడ్ రాజు, రమణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కేంద్ర పథకాల లబ్ధి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - కైకలూరు

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన నూతన పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో జరిగిన వన్ ప్రొడక్ట్ వన్ నేషన్ స్టాల్‌ను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారతీయ రైల్వే ఆధునీకరణలో భాగంగా రూ.85 వేల కోట్లకు పైగా ప్రాజెక్టుల ప్రారంభం, పది వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపారు. రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి, బిజెపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గీతాంజలి మృతి బాధాకరం

ప్రజాశక్తి - కామవరపుకోట

గీతాంజలిదేవి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని వైసిపి జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ దాసి పండు అన్నారు. తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెనాలికి చెందిన గీతాంజలి జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరు కావడం, అమ్మఒడి పథకం ద్వారా లబ్ధి పొందడం పట్ల ఆమె తన ఆనందాన్ని మీడియా ద్వారా వ్యక్తం చేసిందని, దీన్ని భరించలేని టిడిపి కార్యకర్తలు ఆమెను సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్ చేసి, మానసికంగా హింసించి, చివరికి తను ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకునేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారకులైన వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఆమె మృతికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరిశెట్టిగూడెం మత్స్యకార సొసైటీ ఛైర్మన్ పెనుమాల సంజీవరావు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారణమైన వారిని శిక్షించాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ మెంబర్ గుర్రాల రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సామాన్య ప్రజలను సైతం భావవ్యక్తీకరణ చేయకుండా నిరోధించే అసాంఘిక శక్తులను నిరోధించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. గీతాంజలి ఇద్దరూ కుమార్తెలకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలని కోరారు.

బంజారా తండాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - టి.నరసాపురం

బంజారాల చరిత్ర, ఇతిహాసాలను పరిరక్షించుకుంటూ జాతిని చైతన్య పరచడమే బంజారా బజరంగీ భేరి సంఘం ప్రధాన లక్ష్యమని మాజీ సర్పంచి జరభల పూర్ణయ్య నాయక్ అన్నారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరి నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా జరభల పూర్ణయ్య నాయక్, ధరావత్ స్వామి నాయక్, అధ్యక్షులుగా జరభల చందా నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా వేణు గోపాల్ నాయక్, కోశాధికారిగా ధరావత్ రవి నాయక్, ఉపాధ్యక్షులుగా భూక్యా సుగాలీ నాయక్, భూక్యా రాము నాయక్, జరభల బాలాజీ నాయక్, ప్రచార కార్యదర్శి దేశావతు వెంకా నాయక్, కార్యదర్శులుగా హసావత్ వెంకటేశ్వరావు నాయక్, భూక్యా రాములు నాయక్, భూక్యా సత్యం నాయక్ సభ్యులుగా తేజావత్ బాబీ నాయక్, జరభల పీరయ్య నాయక్, గుగ్గులోతు శ్రీను నాయక్, భూక్యా రమేష్ నాయక్, భూక్యా వెంకట నారాయణ నాయక్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు జరభల చందా నాయక్ మాట్లాడుతూ బంజారాల పురాణ పురుషుడు వీర హనుమాన్ నడిచిన ధర్మ మార్గంలో బంజారా జాతిని నడపడమే సంఘ కర్తవ్యం అని అన్నారు.

'పాలి ప్రసాద్ మృతి తీరని లోటు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి జిల్లా నాయకులు, ఉభయ గోదావరి జిల్లాల గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పాలి ప్రసాద్(71) ఆకస్మిక మృతి టిడిపికి, జిల్లా ప్రజలకు తీరని లోటని చేతి వృత్తి దారుల సంఘం నేత ఆర్గనైజర్ పి.ఆదిశేషు నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులో జనరిక్ మందుల షాపును ముసునూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వారి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుల చేతులమీదగా ప్రారంభించారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి ప్రభుత్వంలో ఒక అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని, ఎక్కడ చూసినా సమస్యలేని కనీసం వీధి దీపాలు కూడా వేయలేని పరిస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని టిడిపి, జనసేన ఉమ్మడి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ మండిపడ్డారు. మండలంలోని హైపరాజుగూడెం, గణపవరంగూడెం, అనపనేనివారిగూడెంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం గ్రామాలలో రోడ్లు, వీధి దీపాలు కూడా వేయలేని దీన స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని, డ్రయినేజీలు అధ్వానంగా ఉన్నాయన్నారు. అభివృద్ధి పేరు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని, ఏ ఊరు వెళ్లినా, ఏ వీధి చూసినా డ్రయినేజీ, వీధి దీపాలు లేక అధ్వానంగా కనిపిస్తున్నాయని, అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రసాద్, ఎస్‌సి సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పల్లి శ్రీను, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోడ అనీష్ జయరాజు పాల్గొన్నారు.

మహనీయులే స్ఫూర్తి : మోషేనురాజు

ప్రజాశక్తి - కైకలూరు

మహనీయుల విగ్రహాలే నేటి తరానికి స్ఫూర్తియని శాసన మండలి ఛైర్మన్ కొయ్య మోషేన్ రాజు తెలిపారు. మంగళవారం స్థానిక కోరుకొల్లు - కలిదిండి రోడ్డులోని కూడలి వద్ద మహాత్మా జ్యోతిరావ్‌పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. నేటి యువత పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విఆర్‌ఎ మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని గురవాయిగూడెం విఆర్‌ఎ కొదమ సుబ్బారావు ఏలూరు గవర్నమెంట్ హాస్పటల్‌లో వైద్యం పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. గురవాయిగూడెంలో ఈనెల 5న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని విఆర్‌ఎ గాయపడటంతో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందారు. విఆర్‌ఎకు ఐదుగురు కొడుకులు, భార్య ఉన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

ట్రాన్స్ కో భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి కోటి రూపాయల సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిధులు మంజూరయ్యాయని భీమడోలు సహాయ డివిజనల్ అధికారి గోపాలకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా పలుచోట్ల ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు బదిలీ చేయటం, మరికొన్ని చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, కాలం చెల్లిన విద్యుత్ లైన్‌ల స్థానంలో నూతన విద్యుత్ లైన్‌ల మార్పిడి వంటి కార్యక్రమాలను చేపట్టారు. దీనిలో భాగంగా భీమడోలు హై స్కూల్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కిలోవాట్ల సామర్థ్యం గల నూతన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌కు మంగళవారం ప్రముఖులు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎడిఇ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని జి.కొత్తపల్లి, భీమడోలు, తిమ్మాపురం గ్రామాలకు 100 కిలో వాట్ల సామర్థ్యం గల అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరయ్యాయన్నారు. ఇదేవిధంగా నూతనంగా


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసిన ట్రాన్స్ కో అధికారులు

మంజూరైన 63 కిలో వాట్ల సామర్థ్యం గల ఏడు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఎం.నాగులపల్లికి రెండు, తిమ్మాపురంకు ఒకటి, వడ్డిగూడెంకు ఒకటి, జి.కొత్తపల్లి ప్రాంతానికి 3 వంతున ప్రత్యేకించామన్నారు. ఇదే క్రమంలో 40 కేవి ఎ సామర్థ్యం గల 5 నూతన ట్రాన్స్‌ఫార్మర్లను భీమడోలుకు మూడు, ఎం.నాగులపల్లికి ఒకటి, జి.కొత్తపల్లికి ఒకటి వంతున ప్రత్యేకించామని తెలిపారు. జి.కొత్తపల్లితో పాటు ఎం.నాగులపల్లి, ఇతర గ్రామపంచాయతీల పరిధిలో దాదాపు 10 కిలోమీటర్ల పొడవున విద్యుత్ లైన్‌లు శిథిలావస్థకు చేరటం గమనించామన్నారు. వీటి స్థానంలో నూతన లైన్‌ల ఏర్పాటు జరిగిందని వివరించారు. భీమడోలులో ఏర్పాటు చేసిన 100 కిలోవాట్ల సామర్థ్యం గల నూతన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల ఇప్పటికే ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం తగ్గుతుందన్నారు. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నూతన పంచాయతీరాజ్ తాగునీటి బోరుకు వోల్టేజ్ సమస్యలేని విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలియజేశారు.

ఉమ్మడి ప్రభుత్వాన్ని తీసుకురావాలి

జనసేన పోలవరం ఇన్‌ఛార్జి బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

గ్రామస్థాయిలోని నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేసి టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని తీసుకురావాలని జనసేన పోలవరం ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు అన్నారు. మంగళవారం కొయ్యలగూడెం మండలంలో ఆయన విస్తృత స్థాయి పర్యటన చేశారు. అనంతరం టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు మేఘాల దేవితో సమావేశం అయ్యారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించారు. పోలవరం సీట్ ఎవరికి ఇచ్చినా అందరూ సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. పొంగుటూరు, కన్నయగూడెం గ్రామాలలో జనసేన, టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కన్నాయగూడెంలో ఉన్న శ్రీఅభయ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు కొయ్యలగూడెం టౌన్ అధ్యక్షుడు మదేపల్లి శ్రీనువాసు, పసుకుర్తి ఉమ, మండల ప్రధాన కార్యదర్శి ఏపురి సతీష్, పొంగుటూరు అధ్యక్షుడు భాస్కరరావు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌లో 'పది' పరీక్షా పత్రాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను మంగళవారం పటిష్ట బందోబస్తు నడుమ భద్రపరిచారు. ఈ సందర్భంగా పట్టణ జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం వివిఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించుచున్న ఐదు సెంటర్లలో 1,177 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను భద్రపరచినట్లు తెలియజేశారు.

'అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఏనిర్ణయం తీసుకున్నా మాకు శిరోధార్యమని మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా రాష్ట్రంలో ఏ పార్టీకి సీటు ఇచ్చినా ఆ నియోజకవర్గ అభ్యర్థిని గెలిపించడానికి పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. జిల్లాలోని పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం సహా రాష్ట్రంలో పొత్తు ధర్మాన్ని పాటించాలని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నాయకులకు, కార్యకర్తలకు అధినేత సముచిత స్థానం కల్పిస్తారన్నారు. పొత్తులో త్యాగాలు తప్పవని, కార్యకర్తలు విజ్ఞతతో ఆలోచించాలని హితవు పలికారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని భీమడోలు సిఐ బి.బి.రవికుమార్ తెలిపారు. మండలంలోని చెట్టున్నపాడు, ఆగడాల లంక, గుండుగొలను గ్రామాలలో మంగళవారం భీమడోలు సిఐ, ఎస్ఐ వై.సుధాకర్ ఆధ్వర్యంలో పారా మిలిటరీ బలగాలు, పోలీసులు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

ఘనంగా రామకృష్ణ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కైకలూరు

స్థానిక ఎన్‌జిఓస్ కాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి మందిరంలో మంగళవారం శ్రీరామకృష్ణ 189వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచే వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేశారు. శ్రీమన్నారాయణ గోష్టి మహిళలు విష్ణు సహస్ర పారాయణం పాటించారు. డాక్టర్ కడిమెళ్ళ వరప్రసాద్‌చే ఉదయం 11 గంటల నుంచి ప్రవచనం చేశారు. విద్యార్థులు అష్టావధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు వెంకటేశ్వర వర్మ, రాజేశ్వరరావు, తాతారావు, అశోక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

'పాస్టర్లను ఆదుకున్న వైసిపి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాష్ట్రంలోని పాస్టర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇచ్చి వైసిపి ప్రభుత్వం ఆదుకుందని ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులో మంగళవారం నిర్వహించిన పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎంఎల్‌ఎగా గెలిపించాలని, దీనికోసం పాస్టర్లందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ క్రైస్తవ పాస్టర్లు, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

తడికలపూడిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను అందరూ వినియోగించుకోవాలని జెడ్‌పిటిసి కడిమి రమేష్ అన్నారు. తడికలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందరికీ ఉచిత, నాణ్యమైన వైద్యం కోసం ప్రతిఏటా కొన్ని వేల కోట్లు ప్రజల వైద్యం కోసం ఖర్చు పెడుతుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా గ్రామ స్థాయిలో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని గ్రామస్థులకు 24 గంటలూ అందుబాటులో ఉంచుతున్నారని, ప్రజలందరూ వీరి సేవలు వినియోగించుకోవాలని తెలియజేశారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపిటిసి గంగుల కడియాలు, కొండపల్లి ధర్మరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు, రోగులు పాల్గొన్నారు.

చిన్నారులకు గొడుగుల పంపిణీ


గొడుగులతో చిన్నారులు

ప్రజాశక్తి - పోలవరం

అంగన్వాడీ చిన్నారులకు ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ముచ్చిక రంజిత్ కుమార్ దొర మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ పసిపిల్లలు దేవుడితో సమానమని, వారికి చిన్న వయసు నుంచే సత్ప్రవర్తన, సమగ్ర క్రమశిక్షణ, విద్యా బుద్ధులు నేర్పిస్తే భవిష్యత్ తరాలకు మంచి పౌరులను అందజేసిన వారమవుతామని అన్నారు. ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి 12 సంవత్సరాలైన సందర్భంగా మండలంలో అన్ని పంచాయతీలలో అంగన్వాడీ చిన్నారులకు గొడుగులు, పాదరక్షలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతగా చేగొండపల్లి, సింగనపల్లి, మామిడిగొంది గ్రామాలలో అంగన్వాడీలకు గొడుగులు పంపిణీ చేసినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ సైనికులు ముచ్చిక శివకుమార్, యోగి, రామారావు పాల్గొన్నారు.

726 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి పేదవాడికి ఉచిత వైద్య సదుపాయం అందాలనే లక్ష్యంతోనే మెగా వైద్య శిబిరం పెట్టినట్లు చింతలపూడి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వెంప దుర్గారావు అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజిగుడెం గ్రామంలో చింతలపూడి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వెంప దుర్గారావు ఆధ్వర్యంలో ఆశ్రమ హాస్పటల్ వారు మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెటిక్, గైనకాలజీ, ఇఎన్‌టి, ఆప్తమాలజీ, మొదలగు డాక్టర్లచే, 726 మంది పేషెంట్‌లు వైద్యంతోపాటు ఉచిత మందులు వినియోగించుకున్నారన్నారు. అందరికి సక్రమంగా అన్ని వైద్య పరీక్షలు చేయించి, ఆపరేషన్ అవసరమైన వారికి ఆశ్రమ హాస్పిటల్ వారు ఉచితంగా బస్సు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించిన ఆశ్రమం హాస్పిటల్ వారికి, వెంప దుర్గారావుకి పరిసర ప్రాంతాల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

పలుచోట్ల వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పోలవరం

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని పోలవరం పంచాయతీ ఆవరణలో పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంపిపి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఆవిర్భవించి 13 సంవత్సరాలు పూరైందని, ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని అన్నారు. హామీ ఇవ్వకుండా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన 600 హామీలలో ఏ హామీని నెరవేర్చలేదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో పోలవరం ఎంఎల్‌ఎగా తెల్లం రాజ్యలక్ష్మిని, మరలా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పొడుం శ్యాం కుమార్, దత్తి రాంబాబు, మాదేపల్లి సాయి రామకృష్ణ, సిద్ధన వెంకటరత్నం పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో మంగళవారం వైసిపి ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు, వైసిపి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సుబ్బరాజు కుటుంబాన్ని ఆదుకోవాలి'

ప్రజాశక్తి - చాట్రాయి

నిస్సహాయ స్థితిలో ఉన్న సుబ్బరాజు కుటుంబానికి ఆర్థికపరంగా సహాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చాట్రాయి మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, చిన్నంపేట సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపల్ పలగాని శ్రీనివాసరావు, చిన్నంపేట గ్రామానికి చెందిన బుడుపుల రామకృష్ణ, కె.నాగేశ్వరరావు కోరారు. మంగళవారం సుబ్బరాజు కుటుంబానికి నిత్యావసర సరుకులు, ఒక నెలకు సరిపడా మందులకు డబ్బులు వారు అందజేశారు. మండలంలోని పోలవరం గ్రామంలో కంకోలం సుబ్బరాజు అనే వ్యక్తికి తలలో ఉన్న సమస్యకు 2022 డిసెంబర్ 12వ తేదీన విజయవాడలో బ్రెయిన్‌కి ఆపరేషన్ రెండుసార్లు జరిగింది. అనంతరం పక్షవాతం వచ్చి కుడికాలు, కుడి చెయ్యి పని చేయకుండా పోవడంతో మంచానికే పరిమితం అయ్యారు. షుగర్ ఉండటం వల్ల కాలికి పెద్ద పుండు పడి లేవలేని


ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

స్థితిలో జీవిస్తున్నారు. నిరుపేద కుటుంబమైన సుబ్బరాజుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలవరం గ్రామం మహిళా సంఘం నాయకులు అక్కిరాజు శ్యామల, లింగోజు సరిత, ఎల్.ప్రసన్న సుబ్బరాజు కుటుంబం పడుతున్నటువంటి ఆర్థిక ఇబ్బందులను చూసి దాతల సహకారం కోరుతున్నారు.

'ఆమరణ దీక్షకు స్వల్ప విరామం'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పార్టీ పొత్తు ధర్మం పాటిస్తూ అందులో భాగంగా ఏలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ సీటుని మిత్రపక్షమైన టిడిపికి కేటాయించడం పట్ల ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ పార్టీ అధిష్టానం నుంచి ఎటువంటి పిలుపు రాలేదన్న మనస్తాపంతోనే ఆమరణ నిరాహారదీక్ష తలపెట్టాలని నిర్ణయించుకున్నామని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఈనెల 14వ తేదీ జనసేన ఆవిర్భావ దినోత్సవం రోజున జనసేన నిర్వహించబోయే ఆమరణ నిరాహార దీక్ష విషయం తెలుసుకుని తాడేపల్లిగూడెం జనసేన ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్‌ను పార్టీ పెద్దలు పంపించారు. ఈమేరకు ఏలూరు వచ్చిన బొలిశెట్టి మీడియా సమావేశంలో మాట్లాడుతూ పార్టీ పెద్దలు ఆదేశించిన విధంగా రెడ్డి అప్పలనాయుడుకు తగు గౌరవం కల్పించే బాధ్యత నాది అని ఏలూరు జనసేన నాయకులకు హామీ ఇచ్చారు. అంతవరకు ఆమరణ నిరాహార దీక్షను రెడ్డి అప్పలనాయుడు తాత్కాలిక విరమణ ఇవ్వాలని బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీ అదిష్టానం బొలిశెట్టి శ్రీనివాస్‌ని పంపించి హామీ ఇచ్చారని, వారిపై నమ్మకం ఉంచి ఈ ఆమరణ నిరాహార దీక్షని కొంతకాలం వాయిదా వేస్తున్నామని తెలియజేశారు. ఒకవేళ పార్టీ నుంచి ఎటువంటి హామీ రాకపోతే నిరాహార దీక్ష చేయడానికి వెనుకాడబోనని హెచ్చరించారు. మీడియా సమావేశంలో ఉభయగోదావరి జిల్లాల ఎన్నికల సమన్వయకర్త బివి.రాఘవయ్య చౌదరి, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

బిజెపి, టిడిపి, జనసేనకు వ్యతిరేకంగా పోరాడాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో మతోన్మాద బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలకు, వైసిపికి వ్యతిరేకంగా ఇండియా కూటమిలో ఉన్న సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు మద్దతు తెలపాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో సన్నేపల్లి సాయిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వనజ మాట్లాడుతూ సిపిఐ ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేసిన అనితర పోరాటాలు, ఉద్యమాలను ప్రతిబింబించేలా రాబోవు ఎన్నికల్లో సిపిఐ పోటీ చేసే స్థానాల్లో విజయం సాధించేందుకు ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగ ప్రభాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరావు, యు.హేమ శంకర్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం 10వ సచివాలయం పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్ మల్టీపర్పస్ హాల్‌లో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదవాడు సొంత ఇంట్లో ఉండాలనే సంకల్పంతో ఇళ్ల స్థలం ఇచ్చిన నాటి నుంచి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు కావలసిన ఖర్చు అంతా బరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చిటికెలా అచ్యుతారామయ్య, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, స్థానిక కౌన్సిలర్ అయనలా వెంకటరమణ మూర్తి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రేపల్లెవాడలో డ్రింకింగ్ బోర్లు, కరెంట్ వోల్టేజ్ సమస్యతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సర్పంచి, ఆ ఏరియా వార్డు మెంబర్లు విజ్ఞప్తి మేరకు 100 ట్రాన్స్‌ఫార్మర్లు, రేపల్లెవాడలో 63 ట్రాన్స్‌ఫార్మర్‌లు వెంటనే సాంక్షన్ చేశారు. ఎలక్ట్రికల్ డిఇ, ఎలక్ట్రికల్ ఇడి సహకారంతో ఎఇ రామారావు స్పందించి సాంక్షన్ చేశారు. పరింపూడి రామాలయం వద్ద కూడా 100 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి పై అధికారులు భరోసా ఇచ్చి ఉన్నారు. తొందర్లోనే అక్కడ కూడా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరుగు తుందని సర్పంచి విజయ కుమారి తెలిపారు.

17 మంది విద్యార్థులు గైర్హాజరు

కలిదిండి: ఇంటర్ ప్రథమ సంవత్సర ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్షకు పదిహేడు మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరెండెంట్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్షకు 116 మంది హాజరు కావల్సి ఉండగా 99 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.